గ్రహణంతో మూతపడిన ఆలయాలు

- చంద్రగ్రహణం కారణంగా ఆదివారం సాయంత్రం ఆలయాలు మూసివేత
- సోమవారం ఉదయం పూజలు పునఃప్రారంభం



మూసివేసిన శ్రీ భూ నీలా సమేత శ్రీ వరదరాజ స్వామి దేవాలయం

కొల్లూరు: చంద్రగ్రహణం కారణంగా ఆలయాలు మూతపడ్డాయి. ఆదివారం సాయంత్రం నుంచి దేవాదాయ, ధర్మాదాయ శాఖాధికారులు ఆలయ గర్భగుడితో పాటు, ప్రధాన ద్వారాలను మూసి దైవదర్శనాలను నిలిపివేశారు. మండలంలోని కొల్లూరు అనంతభోగేశ్వరాలయం, వేణుగోపాల స్వామి ఆలయం, చిలుమూరు ఉభయ రామలింగేశ్వర క్షేత్రం, అనంతవరం, క్రాప, తదితర గ్రామాలలోని శివాలయాలు, రామాలయాలను మూసివేశారు. అర్ధరాత్రి చంద్రగ్రహణం వీడిన అనంతరం సోమవారం తెల్లవారుజామున ఆలయాల శుద్ధి, సంప్రోక్షణ అనంతరం భక్తులకు దైవదర్శన అవకాశం కల్పించనున్నట్లు ఆలయాల అర్చకులు పేర్కొన్నారు.

భట్టిప్రోలు: చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం భట్టిప్రోలు మండలంలోని దేవాలయాలను మూసివేశారు. స్థానిక శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి, దేవతల గుడిగా ప్రసిద్ధి గాంచిన శ్రీ విఠలేశ్వర స్వామి, పెదపులివర్రులో కొలువైన శ్రీ వరదరాజ స్వామి దేవాలయాలలో ఉదయం ప్రాతఃకాల పూజల అనంతరం ఆలయాలను మూసివేశారు. సోమవారం ఉదయం ఆలయాలు తెరువనున్నట్లు అయా కార్యనిర్వహణాధికారులు తెలిపారు. ఆలయ శుద్ధి (స్నపన) అనంతరం దర్శనానికి అనుమతి ఇవ్వనున్నట్లు పేర్కొనారు.గ్రహణ కాలం రాత్రి 9:56 గంటల నుంచి తెల్లవారు జామున 3:30 గంటల వరకు ఉంటుందన్నారు.



కొల్లూరులో గ్రహణం సందర్భంగా మూసివేసిన అనంతభోగేశ్వరాలయం

గ్రహణ కాలంలో ప్రత్యేక అభిషేకాలు..

పెదపులివర్రు(భట్టిప్రోలు): చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం భట్టిప్రోలు మండలం పెదపులివర్రు బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రాజరాజ నరేంద్ర స్వామి (శివాలయం) దేవాలయం తలుపులు తెరిచే ఉంచారు. గ్రహణ కాలంలో (సూర్య, చంద్ర) ఆనవాయితీగా ప్రత్యేక అభిషేకాలు, జపాలు నిర్వహించడం ఇక్కడి స్వామివారి ప్రత్యేకత. గ్రహణ కాల సమయంలో మూల మూర్తులకు శాంతి అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. పూజా కార్యక్రమాలను అర్చకులు ఆమంచి సృజన్ కుమార్ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ ఆలయంపై గ్రహణ ప్రభావం ఉండదని తెలిపారు.



పెదపులివర్రు శివాయంలో గ్రహణ కాల పూజలు

అధికారుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం

సాక్షి ఎఫెక్ట్

కొల్లూరు: యూరియా కోసం రైతులు పడుతున్న అగచాట్లపై జిల్లా కలెక్టర్ అధికారులపై మండిపడ్డారు. ఆదివారం 'సాక్షి'లో 'యూరియా కోసం అగచాట్లు' శీర్షికన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. దీంతో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం యూరియా వినియోగంపై రైతాంగానికి అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించడంతో మండల స్థాయి అధికారులు ఆదివారం ఆఘమేఘాలపై మండలంలోని దోనేపూడిలో రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని క్రాప, ఈపూరులో దగ్గరుండి రైతులకు యూరియా పంపిణీ చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు మండల స్థాయి అధికారులు వెల్లడించారు. యూరియా పంపిణీ సమయంలో పీఏసీఎస్‌లు, ఆర్ఎస్‌కేలు, జీడీసీఎంఎస్‌ల వద్ద రైతులకు నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అందుబాటులో ఉన్న యూరియాను సక్రమంగా పంపిణీ చేయడానికి రైతులు మూకుమ్మడిగా ఎగబడకుండా లైన్ పద్ధతిని పాటించే విధంగా చర్యలు చేపట్టనునండటంతో పాటు, రైతులకు మంచినీటి సౌకర్యం కల్పించనున్నట్ల తెలిపారు.



కలెక్టర్ సూచనలతో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

క్రీడాకారులు శిక్షణ శిబిరాలను వినియోగించుకోవాలి

బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు

నగరం: క్రీడాకారులు శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక బాల ఏసు ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఈనెల 4 నుంచి జరుగుతున్న బాల్‌బాడ్మింటన్ శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈనెల 12, 13, 14 తేదీల్లో అనంతపురం జిల్లా బత్తులపల్లి మండల రామాపురంలో జరిగే రాష్ట్ర స్థాయి బాలికల బాల్‌బాడ్మింటన్ పోటీలలో పాల్గొనే ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తేదీ వరకు శిక్షణ శిబిరం కొనసాగుతుందన్నారు. క్రీడాకారులు శిక్షణ శిబిరంలో ఇచ్చే సూచనలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శివశంకర్, జాయింట్ సెక్రటరీ జోన్నానాయక్, వ్యాయామ ఉపాధ్యాయుడు వైవీ గోపయ్య పాల్గొన్నారు.



బాల్‌బాడ్మింటన్ క్రీడాకారిణులతో అసోసియేషన్ కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులు

'అన్నదాత పోరుబాట' విజయవంతం చేయాలి

వేమూరు: యూరియా కొరతపై 'అన్నదాత పోరుబాట' కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దాది సుబ్బారావు తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు, కౌలు రైతులు యూరియా కోసం నానా బాధలు పడుతున్నారన్నారు. యూరియా సకాలంగా అందించాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈనెల 9వ తేదీన రేపల్లె రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అధ్వర్యంలో వినతిపత్రం అందజేయనున్నట్లు ఆయన వివరించారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. బొల్లిశెట్టి ప్రభాకరరావు, గోపాలం రాము, దున్నా మేరీసు బాబు, తలతోటి జిగన్‌బాబు, పిల్లి శ్యామ్ ప్రసాద్, కోలాటంపు గోపి, చిన్న, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సుబ్బారావు

విద్యుత్ ట్రాన్స్‌ఫారం చుట్టూ పిచ్చిమొక్కలు



వేమూరు: వేమూరు మండలం జంపని గ్రామంలో పోతుమర్రు వెళ్లే రోడ్డులో విద్యుత్ ట్రాన్స్‌ఫారం చుట్టూ పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి. దీంతో ట్రాన్స్‌ఫారం పిచ్చి మొక్కల మధ్య దర్శనమిస్తోంది. పిచ్చి మొక్కలు తొలగించకపోవడంతో అవి ట్రాన్స్‌ఫారం ఎత్తుకు క్రమంగా ఎదుగుతున్నాయి. సమస్యను విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమ బోర్డును ప్రారంభించాలి

బాపట్ల అర్బన్: బిల్డింగ్ వర్కర్స్ కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డును వెంటనే తిరిగి ప్రారంభించాలని ఏపీ బిల్డింగ్ ఇతర నిర్మాణ రంగ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వీ నరసింహారావు డిమాండ్ చేశారు. ఆదివారం బాపట్లలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మహా సభను నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల పోరాట ఫలితంగా 1996లో సంక్షేమ బోర్డు ఏర్పడిందని అన్నారు. ఈ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 15న కార్మిక కమిషనర్ కార్యాలయం వద్ద విజయవాడలో ధర్నా జరుగనుందని వివరించారు. ఈ ధర్నాలో భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశానికి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జె.ధర్మరాజు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్, పి.పోలిరెడ్డి, శ్రీనివాసరావు, బాబు వెంకట్రావు, ఎస్‌కే నాగూర్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న నరసింహారావు

కార్మికులకు కనీస వేతనాలు అందించాలి

బాపట్ల అర్బన్: మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్ డిమాండ్ చేశారు. ఆదివారం ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మజుందార్ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులు ప్రభుత్వ పాఠశాలల్లో ఏళ్ల తరబడి విద్యార్థులకు భోజన సదుపాయాలు కల్పిస్తున్నారని తెలిపారు. సకాలంలో బిల్లులు రాకపోవడంతో అప్పులతో సతమతమవుతున్నారని వివరించారు. వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్కువ వేతనం చెల్లిస్తుందని.. నేటి ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశానికి సునీత అధ్యక్షత వహించారు. నాయకులు రమాదేవి, జిల్లా నాయకులు నాగలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను దోషులుగా చిత్రీకరించే పనిలో ప్రభుత్వం

రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు

బాపట్ల: రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలోని సమస్యలను పరిష్కరించకుండా ఉపాధ్యాయులను దోషులుగా చిత్రీకరించే పనిలో ఉందని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు పేర్కొన్నారు. యూటీఎఫ్ బాపట్ల జిల్లా శాఖ మధ్యంతర కౌన్సిల్ సమావేశం ఆదివారం స్థానిక ఎన్‌జీవో హోమం నందు జిల్లా అధ్యక్షులు జడ వినయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానాల వల్ల విద్యా రంగం వెనుకబాటు పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు, కోశాధికారి ఎం.వెంకటేశ్వరరెడ్డి, జి.సురేష్, సీహెచ్ ప్రభాకర్, ఆర్.ఆంజనేయులు, జిల్లా గౌరవాధ్యక్షులు పాపారావు, ఉపాధ్యక్షులు బిక్షాల బాబు, జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్, ఆడిట్ కమిటీ సభ్యులు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మట్లాడుతున్న శ్రీనివాసరావు

అఖిల ఆంధ్ర సాధు పరిషత్‌చే అర్ధచాతుర్మాస వ్రతం



తెనాలి: పట్టణంలో 1965లో స్థాపించిన అఖిల ఆంధ్ర సాధుపరిషత్‌లో అర్ధచాతుర్మాస వ్రతం ఆదివారం నుంచి ప్రారంభించారు. అఖిల ఆంధ్ర సాధు పరిషత్ అధ్యక్షుడు పూజ్యశ్రీ పరమాత్మానందగిరి స్వాములవారి అధ్యక్ష ఆధ్వర్యంలో నవంబరు అయిదో తేదీ వరకు ఈ వ్రతం నిర్వహిస్తారు. పరిషత్ గౌరవాధ్యక్షుడు పూజ్యశ్రీ వాసుదేవానందగిరి స్వామి ఈ వ్రతాన్ని ప్రారంభించారు. పూజ్యశ్రీ స్కంద దేవానందగిరి స్వామి, పూజ్యశ్రీ సత్యానంద గిరి స్వామితోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఆశ్రమాధిపతులైన స్వామీజీలు, భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి పూజ్య శ్రీ కృష్ణ చరణానంద భారతీస్వామి పర్యవేక్షించారు.

చాతుర్మాస దీక్ష విరమణ పూర్ణాహుతి

తెనాలి: స్థానిక గంగానమ్మపేటలోని ది తెనాలి కమిషన్ మర్చంట్ అసోసియేషన్లో గత రెండు నెలలు నుంచి జరిపిన అర్ధ చాతుర్మాస్య వ్రతం ముగింపు సందర్భంగా పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) ఆదివారం పూర్ణాహుతిని నిర్వహించారు. చాతుర్మాస్య దీక్ష విరమణ, చంద్రమౌళీశ్వర ఆరాధన, శ్రీ చక్ర అర్చన, వాసవి సంకీర్తన అర్చన నిర్వహించారు పూజ్య బాలస్వామీజీ వారు మాట్లాడుతూ లోక కళ్యాణం, ప్రజల క్షేమం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా శ్రీవిద్య పీఠంలో విశేష గ్రహణ శాంతి జప యజ్ఞం కార్యక్రమాలు జరిపారు. చంద్రగ్రహణం సందర్భంగా పాటించాల్సిన నియమాలను బాల స్వామీజీ భక్తులకు వివరించారు. పెనుగొండ వాసవి శాంతిధామం ప్రధానార్చకులు విశిష్ట మణికంఠచే హోమ కార్యక్రమాలు నిర్వహించారు, ముఖ్యఅతిథిగా హాజరైన శరణాగతి గోష్టి వ్యవస్థాపకులు శ్రీ నరేంద్ర రామానుజ దాస స్వామి భగవద్ తత్వ వైభవాన్ని చెప్పారు. వాసవి సత్ర సముదాయం చైర్మన్ దేవకి వెంకటేశ్వర్లు, టీటీడీ దాస ప్రాజెక్టు గుంటూరు కృష్ణా జిల్లా అధ్యక్షుడు శ్రీమాన్ గడ్డిపాటి శ్రీనివాసరావు, చుండూరు ఉమామహేశ్వర రావు, సాధన మండలి బ్రహ్మవిద్య ఆశ్రమం, బూర్ల అరుణ కుమారి, కనికచర్ల మణికంఠ, నంబూరి వెంకట కృష్ణమూర్తి, రావూరి సుబ్బారావు, ముద్దాభక్తుని రమణయ్య, పల్లపోతు మురళీమోహన్, గోపు రామకృష్ణ, రాజేశ్వరరావు, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



పూర్ణాహుతి పూజలు

ప్రకృతితోనే ఆరోగ్యవంతమైన జీవితం

తెనాలిటౌన్: ప్రకృతితోనే మనిషికి ఆరోగ్యవంతమైన జీవితం కలుగుతుందని ఫాదర్ విన్సెంట్ పేర్కొన్నారు. ఆదివారం చెంచుపేటలోని నిత్య సహాయమాత ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ విన్సెంట్ మాట్లాడుతూ దేవుడు సృష్టించిన ప్రకృతిని మానవుడు పాడు చేయడం వలన అనేక రుగ్మతలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ప్రకృతిని పరిరక్షించాలంటే మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. దేవాలయ ప్రాంగణంలో భక్తులతో కలిసి పలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో గురు శ్రీ ఫాధర్ స్లీవ, విజయ్‌కుమార్, ఎస్ఎస్ఎం యూత్ సభ్యులు, సిస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సమక్షంలోనే యూరియా పంపిణీ

కొల్లూరు: యూరియా కొరతపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. రైతులందరికీ యూరియా పంపిణీ చేయనున్నామని కొల్లూరు తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం మండలంలోని దోనేపూడి రైతు సేవా కేంద్రంలో యూరియా వినియోగంపై రైతులతో ఆయన మాట్లాడారు. రైతులకు అవసరమైన యూరియా పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టనున్నామన్నారు. రైతులకు యూరియా కొరత రాకుండా ఉండేందుకు మండలానికి అవసరమైన పరిమాణంలో యూరియా రెండు రోజుల్లో సరఫరా కానుందని పేర్కొన్నారు. ఇకపై యూరియా పంపిణీ అధికారుల సమక్షంలో ఎటువంటి అవకతవకలు చోటుచేసుకోకుండా పంపిణీ చేస్తామని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో బి.సుబ్బారావు, ఏవో వి.నరేంద్రబాబు, పీఎస్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

ట్రంప్ విధానాలను తిప్పి కొట్టాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

బాపట్ల: ప్రపంచ దేశాలపై ట్రంప్ పెత్తనాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య తెలిపారు. ట్రంప్ ఆర్థిక సుంకాలను వ్యతిరేకించండి.. భారతీయ పరిశ్రమలను కాపాడాలి అనే నినాదంతో పట్టణంలో పాత బస్టాండ్ వద్ద వామపక్షాలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ.. దేశ ఆర్థిక పరిస్థితిని పరోక్షంగా మోదీ దెబ్బతీస్తున్నారని విమర్శించారు. ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా నిలబడి దేశంలో పరిశ్రమలు కాపాడుకోవడానికి ప్రజలు ప్రజాతంత్ర వాదులు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాంతీయంగా చూస్తే ట్రంప్ విధానాలతో ఆక్వా పరిశ్రమ కుదేలవుతోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సింగర కొండ, న్యూ డెమోక్రసీ ఎంఎల్ నాయకులు మేకల ప్రసాద్, సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బాబురావు, కొండయ్య, శరత్, కోటేశ్వర రావు, ఆటో యూనియన్ నాయకుడు బుచ్చిరాజు, వైఎస్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు దోనేపూడి రవి, సీపీఐ, కాంగ్రెస్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ప్రశాంతంగా ముగిసిన జమేతుల్ ఉల్మా ఎన్నికలు

బాపట్ల: బాపట్ల జిల్లా జమేతుల్ ఉల్మా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించామని జమేతుల్ ఉల్మా అడహాక్ కమిటీ కన్వీనర్ ముఫ్తి అబ్దుల్ బాసిద్ తెలిపారు. స్థానిక విజయలక్ష్మీపురంలోని రోటరీ కల్యాణ మండపంలో ఆదివారం జిల్లా ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల కన్వీనర్ అబ్దుల్ బాసిద్ మాట్లాడుతూ.. బాపట్ల జిల్లాలోని అన్ని మండలాల జమేతుల్ ఉల్మా సభ్యులు సుమారు 250 మందికి పైగా ఎన్నికల్లో పాల్గొన్నారని తెలిపారు. ఎన్నికల్లో అధ్యక్షుడిగా ముఫ్తీ అబ్దుల్లా బేగ్ సాహెబ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. ఉపాధ్యక్షులుగా ఆఫీస్ అనస్ సాహెబ్, మౌలానా నూరుద్దీన్ సాహెబ్, మౌలానా ఖలీల్, నజీర్ సాహెబ్, ఇస్మాయిల్ సాహెబ్ ఎన్నికయ్యారని వివరించారు. సెక్రటరీగా ఆఫీస్ హుస్సేన్ సాహెబ్, ఇక్బాల్ సాహెబ్, జాయింట్ సెక్రటరీగా కాజీ ఆఫీస్ అష్రఫ్, హఫీజ్ అబ్దుల్లా, ట్రెజరర్‌గా భువిన్ సాహెబ్, వైస్ ప్రెసిడెంట్‌గా షేక్ మీరా సాద్ సాహెబ్, సభ్యులుగా రియాజ్ గౌస్ లాజం ,ముక్తి హుస్సేన్, మౌలానా అన్వర్, మౌలానా ఖాదర్, హఫీజ్ సిద్దిక్, ముస్తఫాలను ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారని ఆయన తెలిపారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి పోలీస్ సిబ్బంది ఎంతో సహకరించారని ఆయన పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అబ్దుల్ బాసిద్

ఉపాధ్యాయుల సేవలు మరువరానివి

తెనాలిఅర్బన్: ఉపాధ్యాయుల సేవలు మరవరానివని పద్మశాలీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీవీఎస్ రామకృష్ణ పేర్కొన్నారు. పద్మశాలీ ఉద్యోగుల సంక్షేమ సంఘం తెనాలిశాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన వారి అభినందన సభను తెనాలిలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో నైపుణ్యంతో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారన్నారు. అందరూ మన్ననలు పొందడం వలనే అవార్డులు లభించాయని పేర్కొన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన మాచర్ల నాగేశ్వరరావు, ఆకురాతి హరివరప్రసాద్, దివి ఉమాదేవి, మాచర్ల లీలా శ్రీనివాస మూర్తి, ఆరికాటి బాలసుబ్రమణ్యంలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ తెనాలి ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల సుబ్బారావు, కోశాధికారి తిరువీధుల నాగేశ్వరరావు, నాయకులు కటకం వెంకట ప్రసాద్, అందె బాలచంద్రమౌళి, కందుల శ్రీనివాసరావు, కొతవరపు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రజ్ఞాచారికి జాషువా పురస్కారం

తెనాలిటౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సౌజన్యంతో అంతర్జాతీయ గుర్తింపు పొందిన సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని జిల్లా గ్రంథాలయంలో మహాకవి గుర్రం జాషువా జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఉషోదయం ఫౌండేషన్ ఏర్పాటు చేసిన సాహితీ సభలో తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన సాహితీరత్న డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారికి నిర్వాహకులు గుర్రం జాషువా పురస్కారాన్ని ప్రదానం చేశారు.
సాహితీ సభలో ప్రజ్ఞాచారి జాషువాకు పద్య నీరాజనం అనే శీర్షికతో పద్య పఠనం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో భీమవరం ఎమ్మెల్యే టి.రామాంజనేయులు, సంస్థ సీఈవో డాక్టర్ ఎంవీ రత్నం, సంస్థ అంతర్జాతీయ కార్యనిర్వాహకులు డాక్టర్ ఉషారాణి, సాహితీవేత నాగేశ్వర రావు, డాక్టర్ బీవీ.సత్యనారాయణ, నారాయణస్వామి చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశాంసపత్రాన్ని ప్రజ్ఞాచారి అందుకున్నారు. ఈ పురస్కారం లభించడం పట్ల ప్రజ్ఞాచారిని కొలకలూరు సాహితీ ప్రియులు, పెద్దలు అభినందించారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నగరం: మండల కేంద్రమైన నగరంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ నాగుల్‌మీరా తెలిపారు. కావూరు సబ్‌స్టేషన్ నుంచి నగరం సబ్‌స్టేషన్‌కు నూతన లైన్ ఏర్పాటు చేస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మండలంలో అందుబాటులో ఎరువులు

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు మండలంలో ఎరువుల కొరత లేదని మండల వ్యవసాయాధికారి ఎం.హేమంత్ భరత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మోపర్రు, ప్యాపర్రు గ్రామాలకు 39.6 మెట్రిక్ టన్నులు యూరియా రైతులకు అందజేశామని ఆయన పేర్కొన్నారు. కూచిపూడి, పెదపూడి, మూల్పూరు, అమర్తలూరు, ఇంటూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి ఒక్కొక్క సంఘానికి 19.8 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. సోమవారం మండలంలో 99 మెట్రిక్ టన్నులు యూరియాను రైతులకు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. రైతులు, కౌలు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

వెల్లటూరులో కుక్కల బెడద



వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరులో కుక్కల బెడద ఎక్కువైంది. కుక్కలు గుంపులు గుంపులుగా సంచరించడం వల్ల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా కుక్కలు వెంట పడుతున్నాయని.. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకూ అందరినీ కరవడంతో ఆందోళన చెందుతున్నామని స్థానికులు వాపోయారు. కుక్కల బెడద నుంచి పంచాయతీ అధికారులు తమను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

సేవా కార్యక్రమాలకు అవార్డు ప్రదానం



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు గుర్రం మురళీమోహన్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ అవార్డును అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో కళాభారతి సిటీ కల్చర్‌లో యలమంచిలి వెంకట రమణ ఏఎస్‌పీ, ప్రముఖ సినిమా నటుడు శ్రీనివాసరావు చేతుల మీదగా కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్‌తో గుర్తింపు పొందిన మనం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చక్రవర్తి ఆధ్వర్యంలో అవార్డును ప్రదానం చేశారు. మురళీమోహన్‌కు సామాజిక సేవా కార్యక్రమాల కారణంగా ఈ గౌరవం లభించిందని నిర్వాహకులు తెలిపారు. భిక్షపతి, వెంకటరామయ్య, పవన్ తదితరులు ఈ సందర్భంగా మురళీమోహన్‌ను అభినందించారు.

వైఎస్సార్ సీపీలో కష్టపడే కార్యకర్తలకు సముచిత స్థానం



రేపల్లె: వైఎస్సార్ సీపీలో కష్టపడి పనిచేసే వారికి తమ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తప్పక సముచిత స్థానం కల్పిస్తారని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. రేపల్లె నియోజకవర్గం నిజాంపట్నం మండలం అడవులదీవి గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు యార్లగడ్డ మదన్‌మోహన్ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు గణేష్, పలువురు నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మదన్ మోహన్ మాట్లాడుతూ.. పార్టీ అధిష్ఠానం తనపై నమ్మకంతో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు కల్పించిందని, తన బాధ్యతను సమర్థంగా నిర్వర్తించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

విద్యార్థుల ఉన్నతికి కృషి



తెనాలిఅర్బన్: విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయురాలు డి.ఉమాదేవి కృషి చేస్తున్నారని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాదర్ పేర్కొన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు అందుకున్న కొల్లిపర మండల ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ ఉమాదేవి దంపతులను జగ్గడిగుంటపాలెంలోని ఆయన స్వగృహంలో ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంత రావు, కొల్లిపర మండల అధ్యక్షుడు వరప్రతాప్ కుమార్, ప్రధాన కార్యదర్శి కాలేషావలి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.